

# పండుటాకు

కాట్రగడ్డ దయానంద్

ఒకదాని తరువాత ఒకటిగా ఒకే పద్ధతిలో కట్టిన ప్రభుత్వ ఇండ్ల దక్షిణం వరుస... రెండు రెండు పోర్షన్లను ఒక్కొక్క ఇల్లుగా, ప్రతి ఇంటికి ఆ చివర నుండి ఈ చివర వరకు పెద్ద ఎత్తు అరుగుతో మొత్తం పది, పన్నెండు ఇండ్ల వరుస...

ఇంటికీ ఇంటికీ నడుమ ఖాళీ స్థలం... వెనుక వైపుకు మరొక వరుస ఇండ్లు... ఆ ఇళ్లను కలుపుతూ ముందు ప్రక్క సన్నని కంకరరోడ్డు.... రోడ్డుకు ఆవల కనుచూపు మేరనంతా పచ్చగా నిగనిగలాడుతున్న కర్రతుమ్మ చెట్ల చెరువు...

ఒక ఇంటి ముందు కళ్లాపు చల్లి చక్కగా ముగ్గు లేసి ఉంటే మరో ఇంటి ముందు సిమెంటుతో గచ్చు చేసి రంగవల్లులు తీర్చిదిద్ది ఉంది. కొన్ని ఇండ్లముందు వేపచెట్లు, కానుగచెట్లు బలంగా ఏపుగా పెరిగి ఉంటే కొన్ని ఇండ్లు ఏ అడ్డూ అచ్ఛాదనా లేక నగ్నంగా బోసిగా ఉన్నాయి. ఇండ్లల్లో ఆడవాళ్ల వంటల హడావుడి....

ఇళ్ల ముందు అరుగుల మీద బడికి వెళ్లాల్సిన ఆడపిల్లలు తలలు చిక్కు తీసుకుంటూ జడలు వేసుకుంటుంటే మగపిల్లలు పుస్తకాలు, పలకలు సర్దుకుంటున్నారు.

అంతా బాల్యం చదువుల హడావుడి...

అయిదో ఇంటి రోడ్డుకు ఆవల పశువుల పాకలోంచి ముసలి బఱ్ఱె పడుకునే మోర ఎత్తి మిగతా పశువులలాగే నెమరువేస్తూ జంగిలి గొడ్లవాడి కోసం ఎదుర్చూస్తుంది. అదే సమయాన రిక్షా చిన్నోడి సరుకు రిక్షా ఆ ఇంటి ముందున్న వేపచెట్టు ముందు ఆగింది. రిక్షా వెనకే నడుస్తున్న పొడుగాటి మనిషి కిందికి జారిన పంచెను పైకెగగట్టి రిక్షాలో గువ్వలా ముడుచుకుని పడుకున్న ముసలమ్మను రెండు చేతుల్తో ఎత్తుకుని చెట్టుకింద వేసి ఉన్న ఇనుపవైరు మంచమ్మీద పడుకోబెట్టాడు. చిన్నోడు ముసలమ్మ చేతికర్రను, చిన్న గుడ్డల సంచిని మంచం దగ్గర పెట్టి రిక్షాను నెట్టుకుంటూ వెళ్లిపోయాడు.

అతడు తెరిచి ఉన్న ఇంటి తలుపులవైపు ఓరగా చూచేడు. లోపలి నుండి వస్తూ వదిన ప్రభావతమ్మ కనబడింది. మొహం మళ్లీ ముసలమ్మ మంచంవైపు తిప్పి నిలబడ్డాడతడు. మంచంలో పడుకుని ఎగశ్వాసను అతికష్టంగా పీలుస్తున్న అత్తను చూచింది ప్రభావతమ్మ. ఆమె వడలిపోయిన తోటకూర కాడలా ఉంది. నెత్తిమీద చేతి వ్రేలి గెనుపంత పెరిగిన తెల్లని జుట్టూ, విపరీతంగా ముడతలు పడిన ముఖమూ, ఆయాసంతో ఎగిరెగిరి పడుతున్న ఆచ్ఛాదనలేని ఎద, ఎక్కడికక్కడ ఇరిగిపోయి ఎర్రగా గారపట్టిన పళ్లు.

"ఈడ ఉండనని బోయినామెను మళ్లీ ఎందుకు తీసుకొచ్చేవయ్యా? చాకిరీ చేసి ఓపిగ్గా వొండి వార్చడానికి ఈడెవురూ తీరిగ్గా కూర్చునిలేరు" ముఖం నల్లగా పెట్టుకుని మరిదిని చూస్తూ అంది. అతడేమీ మాట్లాడలేదు.

"పోయి పదిరోజులుగాల! పొయ్యేటప్పుడు విచ్చుకున్న పువ్వాలపోయిద్ది. వచ్చేటప్పుడు రోగపు ముద్దై నెత్తుటి నరమాల వచ్చుద్ది," ముసలమ్మ అవతారాన్ని చూస్తూ నిష్ఠూరంగా పలికింది. ముసలమ్మ ముఖం కాస్త ఎత్తి జీవంలేని కళ్లతో కోడలివైపు చూచింది.

"నాలుగు రోజుల్నుంచి జొరం... ఏమీ తినక ఏలబడిపోయింది. మా ఆడదేమో పుట్టింటికి పోయి ఆడనే

ఉంది. నాకేమీ పాలుపోక.... అన్న ఆసుపత్రిలోనన్నా చేరుస్తాడని...'' పైనున్న వేపకొమ్మను చేత్తో వంచుతూ అన్నాడతడు.

''నిజమే! మీ ఆడోళ్లేమో పుట్టిళ్లకు పోతారు. చాకిరీ చెయ్యనూ, ఎత్తిపొయ్యనూ ఆ గ్రహచారమంతా నాకే పట్టింది. ఆస్తంతా మీ ఎదాన్నే పోసింది ముసల్ది. ఎన్నడన్నా ఒక్కపూట ముద్దేశారా? చూడాల్సొచ్చే టప్పటికి పెద్ద కొడుకూ కోడలూ గుర్తొస్తారు. అయినా మాకేంపట్టిందని, తీసకపో, తీసకపో, నేను చెయ్యలేను'' అందామె గట్టిగానే. దానికీ అతడేమీ మాట్లాడలేదు.

జంగిలి గొడ్లవాడు బక్టెగొడ్లను విప్పుతూ ఒక్క క్షణం ఇటువై తిరిగి చూచి నిర్లిప్తంగా వాటిని అదలిస్తూ తోలుకెళ్లిపోయాడు. ఇద్దరు ముగ్గురు బడిపిల్లలు జట్లు జట్లుగా కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఏవో పిండి వంట లను పంచుకుని తింటూ తాపీగా నడిచి వెడుతున్నారు. దేవతావస్త్రాలు ధరించిన ఆసుపత్రి నర్సొకామె నిండి పోయిన పాలిండ్ల బరువుతో కాళ్లకడ్డం పడుతున్న చీరను తిట్టుకుంటూ ఇంటి దగ్గర ఆ సమయానికి ఆకలై ఏడ్చే తొమ్మిది నెలల పసికందు కోసం ఇవేవీ గమనించకుం డానే తన నివాసం వైపు హడావుడిగా నడిచింది.

ప్రభావతమ్మ ఇంట్లోకి వెళ్లి ఏదో పని చూచుకుని వచ్చి ''ఈ ముసల్ది సచ్చిందాకా మమ్మల్ని ఏపుక తినే ట్టుంది. తొంభై ఏళ్లు. ఇంకా ఉండి ఎవుర్ని ఉద్ధరిం చాలనో?'' అని పెద్దగా మొదలుపెట్టి దూరాన వస్తున్న భర్త గోపాలయ్యను చూచి గొంతు తగ్గించింది. అతడు ఇంటికి చేరేటప్పటికి అంతా నిశ్శబ్దమైంది. గోపాలయ్య అందరివైపూ ఒకసారి తేరిపార చూచి మంచంలోని ముసలమ్మ చేయి పట్టుకుని చూచేడు. పొట్టమీద కూడా చెయ్యి వేసి చూచేడు. జ్వరంతో మండిపోతుంది.

''ఎప్పట్నుంచిరా జ్వరం?'' తమ్ముణ్ని అడిగేడు గోపాలయ్య.

''నాలుగు రోజుల్నుంచి అన్నా! తగ్గుద్ది కదా అనుకున్నా''

''మందులేమన్నా వేసుకుందా?'' మధ్యలోనే అందుకున్నాడు గోపాలయ్య.

''ఆచారి దగ్గర రెండు సూదులేయించుకుంది. అన్నకాడికి తీసుకెళ్తే ఆసుపత్రిలో చూపిస్తాడే అని చెప్పినా వినిపించుకోల. ఇయ్యాల బలవంతాన రిక్షాలో ఏసుకొచ్చా,'' చెప్పేడు తమ్ముడు.

ముసలామె లో గొంతుకతో, ''నీళ్లు... నీళ్లు...'' అంది. గోపాలయ్య భార్య వైపు చూచి, ''చెంబుతో నీళ్లతే'' అన్నాడు. ఆమెకు తేవడం ఇష్టం లేనట్లుగా కాస్సేపు కదల్లేదు. రెండు నిమిషాల తర్వాత మళ్లీ ఏమనుకుందో నిశ్శబ్దంగా కదిలింది. ఆవెనుకే గోపా లయ్య కూడా ఇంటిలోకెళ్లి అలమరాలో వెదికి రెండు రకాల బిళ్లలు తీసుకొచ్చి ముసలామెను లేపి కూర్చోబెట్టి మందులు గొంతులో వేసి నీళ్లు తాగించేడు.

''అయ్యోవ్! నేను మాత్రం చేయలేను. ఇన్నాళ్లు సంసారాన్ని ఇంతమాత్రం నువ్వీడ్చుకొచ్చింది సాలు. మనకేం మడులూ మాన్యాల్లేవు అందరికీ కూర్చో బెట్టి పెట్టడానికి. నాకు చేసే ఓపిక్కూడా లేదు,'' ఏమం టాడోనని భర్తను అనుమానంగా చూస్తూ ధైర్యంగా తన మనసులోని మాటలను బయటపెట్టింది ప్రభావతమ్మ.

గోపాలయ్య తల్లివైపు, భార్యవైపు ఒకసారి పండ్లు కొరుకుతూ చూచి, ''అసలు, ఈ ముసిలిముండకు బుద్ధిలేదు. ఈడ నుంచి పోవద్దే అంటే ఆడేందో బూడిచి పెట్టినట్లు పరుగులు తీసుద్ది. ప్రాణం మీదకు తెచ్చు కునిద్ది. మంచాన బడితే ఎవుడు సేవలు చెయ్యాల నీకు?'' అని కోపంగా భార్యవైపుకు తిరిగేడు.

ఆమెకు ధైర్యం వచ్చింది.

''అందుకనే! రిక్షా చిన్నోన్ని పిలిపించి మళ్లీ బండి కట్టించు. వాళ్ల సావేదో వాళ్లు పడతారు.''

''ఏహ్! నోర్మూయ్యి లంజముండా! ఊరికే వాగుతా ఉంటావ్! పళ్లు రాలగొడ్తా మళ్లీ మాట్లాడే వంటే. తల్లిని చూడటం ఎవడికి తప్పుద్దే. మనకు ఇంకో బిడ్డుంటే సాక్కోకుండా పారేసుకుంటామా? ఎవుడి కోసం చేస్తావ్? పో! లోనకు పో!'' అంటూ గదిమేడు.

''రాలగొడ్తావయ్యా... నీకేం రాలగొడతావు. నీకేనా ఏంది అమ్మ? నీతో పాటుగా ఇంకో కొడుకూ, కూతురూ ఉండారుగా! వాళ్లకు లేని బరువు నీ ఒక్కడికే ఏమంట? కాపరానికొచ్చిన పాతికేళ్ల నుంచీ చూస్తున్నా! ఇట్ట చేసి చేసి సంసారం ఈ గతి పట్టిచ్చేవు. నా పిల్లలు చదువుల కొచ్చేసరికి నేను చాకిరీచేసి రెక్కలు ముక్కలు చేసుకోవా ల్సొస్తుంది. నా మాటకు ఎన్నడైనా రాగి పైసంతైనా విలువనిచ్చేవా?'' ఏడుస్తూనే లోపలికి పోయిందామె.

ఒకరిద్దరు చూస్తూనే ఆ దారిన నడిచి వెళ్లేరు. పోస్టుమన్ దసరా రోజులు దగ్గరకొచ్చేయని నవ్వు కుంటూ వచ్చి నమస్కారం పెట్టి ఉత్తరం అందించి వెళ్లేడు. తిరుపతి నుంచి పెద్దకొడుకు రాసిన ఉత్తరం- ఆ నెల ఖర్చులకు డబ్బులు పంపమని! చదివి మడిచి జేబులో పెట్టుకున్నాడు.

తల్లి మంచం దగ్గరికెళ్లి, ఆమె మీదకు వంగి, ''సూదేసుకుంటావా?'' అని అడిగేడు గోపాలయ్య.

''నాకెందుకురా ఇంకా సూదులూ మందులూ! ఇట్టనే ఈ జొరంతోటే కడతేరిపోతే పోలా?'' గొణుగుతూ అంది తల్లి.

''ఇది అంత తొందరగా కడతేర్చే రోగం కాదులే! సూది పడితే తెల్లారేసరికి లేచి కూర్చుంటావ్! నా యిల్లు నా యిల్లు నా ఊరు అనుకుంటూ మళ్లీ ప్రయాణం కడతావ్. వాడికాడైనా ఉంటావా అంటే అదీలేదు. నీ సొంత మూకుడూ, సంసారమూ! ఆ ఊర్నొదిలీ, ఆ గుడిసెనొదిలీ ఉండవు గదా!'' కోపంగానూ, బాధగానూ అన్నాడు గోపాలయ్య.

''ఏదో, నా హయం ఇట్ట గడిచిపోయిందిలేరా! ఇప్పుడైనా ఒక అమ్మతో అనిపించుకోకుండా చేయించు కోకుండా సాగిపోతే అంతే చాలురా! అయినా నీ పిచ్చి గాని పండిపోయినాకు తొడిమూడకుండా ఎన్నాళ్లు చెట్టు కొమ్మనంటిపెట్టుకుని ఉండుద్దిరా?'' ముసలమ్మ అంత జ్వరంలోనూ కొడుకును సమాధానం చెప్పలేని ప్రశ్న అడిగింది.

ప్రభావతమ్మ ఎఱ్రబడిన కళ్లతో లోపల నుండి ముగ్గురికీ టీనీళ్లో, కాఫీ నీళ్లో తెచ్చి ఇచ్చింది. ముసల్ది లేచి కూర్చొని అర్చుకుంటూ అర్చుకుంటూ చెమటలు పట్టిందాకా దాగింది. గోపాలయ్య కూడా తాగి, ''చానా సేపైంది వచ్చి.... ఓపీలో జనం లైను గట్టి ఉంటారు. మధ్యాన్నం అన్నం తిని పోదువుగాని,'' అన్నాడు.

''లేదన్నా! నువ్వుల కోత అయిపోయింది. తొక్కిం చాల. రేత్రికి కూలోల్లను రమ్మన్నాను. ఎల్లాల,'' అన్నాడు తమ్ముడు కూడా లేచి నిలబడి.

జేబులో ఉత్తరాన్ని భార్య చేతికిచ్చి బయల్దేరేడు గోపాలయ్య. ఆ వెనుకే తమ్ముడు కూడా బయల్దేరేడు.

అక్కడకు మూడు మైళ్ల దూరంలోనే గోపాలయ్య సొంత ఊరు. అక్కడ తాతల్నాటి నుంచి వస్తున్న ఒక గుడిసె ఉంది. గోపాలయ్య తల్లిదండ్రులు వారి హయాంలో సంపాదించిన నాలుగెకరాల పోరంబోకు, ఒక ఎకరా పట్టా భూమిని అనుభవిస్తూ వేరే ఇంట్లో కాపురముంటున్నారు తమ్ముడి కుటుంబము. ఆ ఇళ్లకు అర ఫర్లాంగు దూరంలో ఉన్న ఆసుపత్రిలో అటెండరు ఉద్యోగం గోపాలయ్యకు. తల్లికి మాత్రం ఊళ్లో ఉన్న ఆ గుడిసె మీద అమితమైన మమకారం అనుకుంటా రంతా. ప్రాణం పోతే ఆ గుడిసెలోన పోవాలనీ, తన అస్థికలు మాత్రం ఆ ఊరి చెరువులోనే కలపాలనీ ఆమె తీర్మానం. అయితే ఈ కరువు రోజుల్లో కొడుకులనూ, కోడళ్లనూ ఇబ్బందిపెట్టడం ఇష్టంలేకనే తాను చేసుకో లేకపోయినా ఆ గుడిసెలోనే ముసలమ్మ పడి ఉంటుం దన్న విషయం ఆమెకు మాత్రమే తెల్సు.

కోడలుకు మాత్రం ముసలామెను చూస్తే కోపం. ఆ కోపానికి చాలా కారణాలున్నాయి. ఏమీ సంపాదించి ఆస్తి ఇవ్వకపోగా తొంభై ఏళ్లొచ్చి ఇంకా పోకుండా వాళ్ల మీద ఆధారపడటం ఒకటైతే ఏ ఆధరవూ లేనివాడని ఉన్న నాలుగెకరాలూ చిన్న కొడుక్కు కట్టబెట్టిందని మరోప్రక్క కోపం. ఆస్తి తీసుకున్న వాళ్లు ముసలమ్మను చూడకుండా పంట పండలేదనీ, అప్పులయ్యాయనీ అదనీ, ఇదనీ సాకులు చెప్పి బాధ్యతల నుండి మరిది తప్పించుకుంటున్నాడనీ, బరువంతా తమ నెత్తిమీదనే వేస్తున్నాడని అనుమానంతో కూడిన కోపం ఆమెది. తల్లి ఊళ్లో ఉంటే పాలు, పెరుగు సీసాల దగ్గర్నుంచి బియ్యపు సంచుల దాకా గోపాలయ్య తీసుకుని వెళ్లటం ఆమెకు ఏమాత్రం ఇష్టంలేదు.

''కట్టుడు గుడ్డల కాడి నుంచి బియ్యపుమూటల దాకా ఈయన మొయ్యాల్సిందే! ఏనాడన్నా చిన్నకొడు గ్గానీ, కూతురుగానీ ఒక్క ముక్క జాకెటు గుడ్డన్నా కుట్టించిన పాపాన పోలా. ఎప్పుడన్నా ఈయన కొనిచ్చిన జాకెట్టు ముక్క కంటిక్కొస్తె నదురుగా కనబడితేచాలు. మెల్లగా కూతురుకు సాగనంపేది మహాతల్లి. ఉన్న న్నాళ్లు పెట్టేము. ఇయ్యాల మా పిల్లలు ఎదిగి ఖర్చులు పెరిగి కాలూ చెయ్యా ఆడక మా ఇబ్బందుల్లో మేముంటే మా ఆడబిడ్డకు పెట్టలేదని కొరవ. అప్పు డెప్పుడో అప్పుగా ఇచ్చిన అయిదువేలూ అడిగేనని ఆ యమ్మ మా గడప దొక్కదిప్పుడు. ఏం చేస్తాం. బెల్ల మున్నప్పుడే గదమ్మా ఈగలు ముసిరేది,'' ఇందాక హడావుడిగా వెళ్లిపోయిన నర్సు తిరిగ్గా వస్తుంటే ఆపి తన బాధనంతా మాటల్లో వెళ్లగక్కుతోంది ప్రభావతమ్మ.

ముసలామె కోడలు వైపు ఒకసారి చూచి మళ్లీ కళ్లు మూసుకుంది.

కొడుకు రాసిన ఉత్తరం చదువుకున్నాక ప్రభా వతమ్మ బాధ మరింత ఎక్కువైంది. సాలీసాలని జీతానికి తోడు కొడుకులిద్దరూ బయట ఉండి చదువుతుండ టంతో పెరిగిన ఖర్చులూ... పెద్దకొడుకు తిరుపతిలో రెండో సంవత్సరం ఇంజినీరింగూ, చిన్నకొడుకు నెల్లూరులో ఇంటర్ రెండో సంవత్సరమూ చదువు తున్నారు. ఖర్చులు భరించలేక ప్రభావతమ్మ కూడా నాలుగు బఱ్ఱెగొడ్లను పెట్టుకుని పాలో నీళ్లో అమ్మి నాలుగు రూపాయలు సంపాదిస్తోంది. పొద్దుటిపూట ఇడ్లీలో, దోసెలో చేసి కావలసిన వాళ్లు ఇంటికి వస్తే

పొట్లాలు గట్టి ఇస్తుంది. ఆఫీసుల వాళ్లు ఎవరైనా టీ కోసం ఫ్లాస్కులు తీసుకొస్తే డబ్బులు తీసుకొని టీ చేసి పోస్తుంది. అప్పటికీ ఆమె పుట్టింటివాళ్లు కాస్త భూమీ జాగ ఉన్నవాళ్లు. బత్తె గొడ్లక్కావలసిన గడ్డిని సంవత్సరానికొకమారు తోలి పెడతారు. నెలనెలా రేషను బియ్యమూ, కావల్సిన చక్కెరా, పండే ఉప్పులూ పప్పులూ అన్నీ వాళ్లు వచ్చినప్పుడల్లా మోసుకు వస్తుంటారు. వాళ్లు అంత సర్దుతున్నా, గోపాలయ్య ఉద్యోగపు రాళ్లు వస్తున్నా, ప్రభావతమ్మ నిద్ర లేచిన దగ్గర్నుంచీ పడుకున్న దాకా రెండు కాళ్లూ ఒకచోట పెట్టకుండా చాకిరీ చేస్తున్నా ఆ సంసారం ఈదటం మొగుడూ పెళ్లానికి కష్టంగానే ఉంది.

“మనిషికి మనిషి భారమై ఖర్చులు పెరుగుతున్న రోజులు. ముసలమ్మ మామీదనే ఎందుకు పడి వుండాల? తాగడానికి పెద్ద లోటాడు టీనీళ్లు కావాల. తినడానికి కంచము కూడు కావల. మళ్లీ ప్రేమలూ, అభిమానాలు మాత్రం చిన్నకొడుక్కీ, కూతురుకీ... వాళ్ల మీద ఈగవాలనియ్యదు. మా బాధల్తో వేము కాకుండా ఉంటే ఇదొక గుదిబండ మాకు.” నర్సు తీరిగ్గా నిలుచుని వింటోంది.

ముసలమ్మ అసహనంగా మంచంలో అటూ ఇటూ కదిలింది. తను రావటం కోడలుకు ఇష్టం లేదని ఆమెకూ తెల్సు. నాలుగు రోజులు జ్వరంతో అట్టనే మంచాన్ని కరుసుకుని పడుకుంటే చిన్నకొడుకొచ్చి చూచి వాడికీ ఎటూ పాలుపోక వద్దంటున్నా వినకుండా ఇక్కడకు తీసుకొచ్చి పడేసేడు. గతిలేక రావటమే ఇక్కడకు ఆమె. ఎవరి సంసారాలతో వాళ్లు సతమతమయ్యే రోజులు. తనూ వాళ్లకు భారమైందని ముసలమ్మకు అంతులేని బాధ... దానికి తోడు కొడుకూ కోడలూ తన గురించి ఘర్షణ పడటం... ముసలమ్మకు కళ్లు మూసుకున్నా కళ్ల ముందు కదుల్తోంది. ‘తనింకా ఎందుకు బతికున్నట్టో?’ అని మధనపడుతోంది. ఆస్తులూ, అంతస్తులూ దాచిపెట్టివ్వలేదనీ, కోడళ్లేకాదు, కొడుకులిద్దరూ చాలా సందర్భాల్లో బయటపడ్డారు. పెట్టుపోతలు జరగటం లేదనీ, పుట్టింటివాళ్లు ఉన్నా తనకు లేనికిందే సమానమని కూతురు ఎప్పుడో బయటపడింది.

ఆ రోజు మధ్యాహ్నానికి జ్వరం కాస్త తగ్గినట్లుంది. ఒంటినిండా చెమట పట్టింది. భోజనానికొచ్చిన గోపాలయ్య తల్లి జ్వరం చూచి, “తగ్గింది. అయినా సూదేయించుకో,” అన్నాడు తల్లితో.

“లేచి నేనేమన్నా అడవి దున్నాలా ఏందిరా? బతికింది సాల్లే. సూదొద్దు గీదొద్దు,” అంది నిష్ఠూరంగా.

గోపాలయ్య కోపంగా తల్లిని చూచి ఆమెకు ఇష్టం లేకుండానే తోలు వేలాడే ఆమె చేతికి సూదిని గుచ్చేడు. రెండు అరటిపండ్లు తెచ్చి తల్లికిచ్చి, “ఇవి తిను. సాయంత్రానికి కాస్త చారన్నం తిందువు,” అన్నాడు. అవి తీసుకుని, “ఒరే! నాక్కాస్త వక్కాకురా!” అంది కొడుకుతో.

“నాలుగు రోజుల్నుంచి తిండి లేకపోయినా నీకు వక్కాకు మాత్రం కావాల,” కోపంగా అని లోపలికెళ్లేడు.

అప్పటికే ముందు గదిలో అన్నం కూరగిన్నెలు తెచ్చిపెట్టి పీటవాల్చి కింద కూర్చునుంది ప్రభావతమ్మ. కాళ్లు చేతులు కడుక్కుని పీట మీద కూర్చున్న గోపాలయ్యకు అన్నం వడ్డిస్తూ.

“ఏయ్యా! ఏడన్నా డబ్బులు కనుక్కున్నావా,” అంది.

“ఆఁ! ఎక్కడా పుట్టేట్టు లేదు. నెల మధ్య అయింది. చేబదులు కాదుగదా నాలుగు రూపాయల వడ్డీక్కూడా దొరికేట్టు లేదు,” అన్నాడు గోపాలయ్య ముద్ద నోట్లో పెట్టుకుంటూ.

“ఏం సదువులో! ఏం ఖర్చులో! రెండో ఏటికే ఇంత కష్టమవుతుంటే ఎనకాల పిల్లోడు చేరేసరికి ఇంకెట్టుండబోద్దో? దాచి పెట్టుకున్న డబ్బులన్నీ అయిపోయె. ఒంటి మీద బంగారమంతా కరిగిపోయి ఎమికలు మిగిలె. పసుపు కుంకాల కిందిచ్చిన కాస్తంత నేలనీ వాళ్లకే అమ్ముకుంటిమి. కష్టపడి చెమటోడ్చిన డబ్బులన్నీ మంచినీళ్ల కింద ఖర్చయిపోతుండె. నాలుగు గొడ్లపాడి చేస్తా కూడా మజ్జిగ నీళ్లు తాగుతుంటిమి. ఎట్టాగయ్యా ఈ సంసారం గట్టెక్కేది,” చిన్న కవ్వంతో మజ్జిగ చేస్తూ నిరాశగా మాట్లాడింది ప్రభావతమ్మ.

కాసేపు ఆగి, “నాయుడన్న డ్యూటీకి రాలేదా?” అడిగిందామె. నాయుడు వాళ్ల ప్రక్క పోర్షన్‌లో ఉండే ఆసుపత్రి గుమాస్తా. భార్య తిరుపతిలో ఉద్యోగం. ఒక్కడే ఇక్కడ వుంటూ రెండు మూడు రోజులకొకసారి భార్యా పిల్లల దగ్గరకు వెళ్లి వస్తూంటాడు.

వచ్చేడన్నట్టుగా తలూపేడు గోపాలయ్య.

“నాయుడన్నను అడిగి చూడగూడదూ!” అందామె.

“ఏమంటాడో? అయినా డ్యూటీ అయిపోయాక ఇంటికొస్తాడుగా! నువ్వే అడుగు. జీతం రాగానే ఇస్తామని చెప్పు” మజ్జిగన్నం కలుపుతూ అన్నాడు గోపాలయ్య.

బయట మంచంలో పండుకుని వింటున్న ముసలమ్మకు వాళ్ల అవస్త తెల్సి కడుపులో ఎవరో దేవినట్లయింది.

చెయ్యి కడుక్కుంటున్న గోపాలయ్యతో, "ముసిలామె మరీ ఎండకపోయింది. ఆసుపత్రి నుంచి వచ్చేటప్పుడు రెండు సెలైను సీసాలు తీసుకురా! జ్వరం తగ్గితే రేపు ఇంట్లోనే కట్టొచ్చు," అందామె.

సరేనన్నట్లుగా తలూపి చెయ్యి తుడుచుకుంటూ బయటకు వచ్చిన కొడుకుని చూచి, "వక్కాకు నమలక నాలుగ జివజివ మంటుందిరా," అంది. గోపాలయ్య వినిపించుకోనట్లుగా మంచం దాటుకుని వెళ్లిపోయాడు. ముసలమ్మ ఏదో గొణుక్కుంది. మధ్యాహ్నం అన్నాలకు ఇంటికి వెడుతున్న బడి పిల్లవాడిని బతిమలాడి వక్కాకు తెప్పించి వాడిచేతే ముసలమ్మకు ఇప్పించింది ప్రభావతమ్మ.

వక్కాకు పంటి కింద పడగానే పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది ముసలమ్మకు! కోడలి మంచితనాన్ని మనసులోనే పొగుడుకుంటూ ఆనందంగా నిద్రలోకి జారుకుంది.

కొద్దికొద్దిగా చీకటి తెరలు ముసురుకునే వేళ ముసలమ్మకు మెలకువొచ్చింది. మధ్యాహ్నం సూది మందు వల్లనేమో జ్వరం పూర్తిగా తగ్గి బాగా ఉషారుగా ఉంది. లేచి కూర్చుంది.

చిన్నపిల్లలు చెట్లకింద ఆడుకుంటున్నారు. ప్రభావతమ్మ బఱ్ఱెపాలు పిండుతుంటే ఆ శబ్దం సంగీత భరితంగా ఉంది. వేపచెట్ల మీద కాకులు కీసర బాసరగా అరుస్తున్నాయి. ఆకాశాన మబ్బులడ్డం లేకపోవటం వలన చంద్రుడు మరింతగా వెలగడానికి సమాయత్తమవుతున్నాడు. దూరాన ఎక్కడి నుంచో ఒక డ్రామా పజ్జం గాల్లో తేలివస్తోంది. అరవ నర్సొకామె పనిలేక రోడ్లు కొలిచే మొగుడితో ఇంటిపనిలోనన్నా సాయం చేయడని గిల్లి కజ్జాలు పెట్టుకుంటున్న సవ్వడి....

ముసలమ్మ మంచం దిగి కాళ్లు కాస్త విసురుగా ఊపి చేతికర్రను తీసుకుని రెండు ఇళ్ల మధ్య నుండి ఇంటి వెనుకవైపుకు వెళ్లింది. వంగుని ఒక్కో అడుగు వేసుకుంటూ మంచం దగ్గరకు వచ్చేసరికి పక్కింటి నాయుడు తలుపు తాళం తీస్తూ కనబడ్డాడు.

"ఏంవా! జొరమంటనే ఎట్టుంది?" అడిగేడు నాయుడు.

"ఫర్వాలేదు. కాస్త తగ్గింది నాయనా! ఈ పూట లేచి నుంచున్నా. నా కొడుకు మాత్ర ఇచ్చినాక ఏ రోగమైనా ఆపూటే," అంది హుషారుగా. కోడలు పాలచెంబు లోపల పెట్టి బయటకొచ్చి

"ఏన్నా! పిల్లలు బాగుండారా?" అని అడిగి సమాధానం కోసం ఎదురు చూడకుండానే, "ఒక్క పూటకేమి వండుకుంటావులే నేను పంపిస్తా," అంది. నాయుడు ఏమీ చెప్పకుండా తలూపుతూ లోనికెళ్లి లుంగీ కట్టుకుని వచ్చి ముసలమ్మ మంచానికి దగ్గరగా అరుగు మీద సతికిలపడ్డాడు.

"ఏం రోగవో నాయునా! ఇయ్యాల తెరిపిచ్చింది," దిండు కింద ఉన్న వక్కాకు పంటి కింద పెట్టుకుంటూ అంది ముసలామె.

"ఊరంతా ఫ్లూ జ్వరాలే! ఆసుపత్రి కొచ్చే కేసులన్నీ అయ్యే!" అన్నాడు నాయుడు.

"మా కాలాన జ్వరమనీ, రోగమనీ ఎరుగుదుమా నాయనా? మూడుపూటలా మూడు ముద్దలు రాగి సంకటో, జొన్నసంకటో తినేవాళ్లం. పండినోల్లయితే రెండోపూట వరిగెబువ్వ.... ఎంత గెట్టి తిండి? ఆ రోజులే వేరు. పొద్దున్నే ఒక ముద్ద తిని, ఒక ముద్ద కట్టుకుని నేనూ, ఆయనా ఊరు లేవకముందే పిల్లాగెనిలో ఉండేవాళ్లం. ఆయన గెనిలోకి దిగేడంటే మళ్లీ పయిటాలకే పైకెక్కటం. మైకాను కత్తిరిస్తూనో, పొరలు తీస్తూనో, గ్రేడు చేస్తూనో సందేల దాకా నాకు కంపినీలో పని! ఇంత డబ్బును ఎపుడు చూచేడు నాయినా... ఇప్పుడు గదా ఏడ చూచినా రూపాయిల గలగలలు! మాకు రూపాయి కాయితమంటేనే అపురూపంగా ఉండేది. నాకు తెల్సి సవరు బంగారం పజ్జెనిమిది రూపాయలు. మరిప్పుడో," చెప్పుకుపోతోంది ముసలమ్మ.

"అన్నో! వూ కొట్టేవాళ్లు ఉండాలేగాని, ముసల్ది రేత్రంతా చెబుతానే ఉంటది విసుగూ విరామం లేకుండా!" నాయుడుకి టీ కప్పునిస్తూ, ముసలమ్మకు గ్లాసు అందిస్తూ అంది ప్రభావతమ్మ.

"ఇయ్యాల గదంటయ్యా ఈల్లందరికీ నేను పనికిరాకుండా పోయింది. ఎంత సంసారం? ఏం కత? నాకు తెలిసేసరికి చారెడు నేలలేదు. నేనూ ఆయన ఈ మైకా గెనుల్లోనే ఎక్కడబడితే అక్కడ కూలినాలి చేస్తూ తినీతినక.... ముగ్గురు తోబుట్టువులకు పెళ్లి చేసేడు ఆయన. అడివి నరికి నానా అగచాట్లు పడి మూడెకరాల పోరంబోకు. ఇయ్యాలో రేపో మాగాడైద్ది. పదేళ్లు చాకిరీ చేస్తే ఇయ్యాల ఆ రూపునుంది చేను. చిన్నోడికి కాస్త ముద్దేస్తంది. కూతుర్ని అక్కడెక్కడో దూరాబారాన ఇస్తే దానికింకా పెట్టలేదనే కొరవ," ముసలమ్మ

చెబుతుండగానే కోడలు నిరసనగా చూచి గడ్డివామి వైపు నడిచింది.

"పోతున్న మా కోడలు విసురు చూచేవా? ఏమీ మిగిల్చి ఇయ్యలేదని కొరవ. అందరం రెక్కలు ముక్కలు చేసుకుని వాణ్ణి కూచోబెట్టి సదివిస్తేనే గదయ్యా! ఇయ్యాల ఆ చదువుకు నాలుగురాళ్లు సంపాదిస్తంది. కాలం... కాలం అట్టాగొచ్చింది. ఏం మాట్లాడినా డబ్బు కాడికొచ్చే ఆగుద్ది," వింటున్నాడో లేడోనని నాయుడివైపు చూచింది ముసలమ్మ.

"నా చిన్నతనాన పెద్ద గాలోన. ఊరు నిండా ఎల్లవనీళ్లొచ్చిన మూడో రోజున మా అమ్మనాయిన కలరొచ్చి సచ్చిపోతే ఆయన మాయమ్మ తమ్ముడు... బికారోడి లాగా అయ్యేడు. అప్పుడు ఎవురో ఎరుకల్ది, దాని కడుపు సల్లగుండ.... సోదిలో మాయమ్మొచ్చి సల్లగ చూస్తాననీ నన్ను చేసుకోమని చెప్పింది. తర్వాత పదిహేనేళ్లకు మళ్లీ గాలోన... పగులే చీకట్లు ముసిరినై... పని చూచుకుని గెనులకు అడ్డంబడి పదిహేను మందిమి... మూడుమైళ్లు నడవాల... ఎక్కడ గుంటుందో, ఎక్కడ మిట్టుందో కనబడకుండా అంతా సదరంగా నీటిమయం. గాలికి ఎదురీత, ముందు నడుస్తున్న మా మగోళ్లు ఏడుగురు. అలవాటైన బాటేనని వాళ్లు ముందు నడుస్తుంటే ఎనకాల ఆడోళ్లం... గెనిపడని బాయొకటి బాట ప్రక్క నుండేది. అమాంతరంగా ఆ ఏడుగురూ చేతిలో ఖాళీ అన్నం టిఫిన్లతో ముందుకడుగేసి మళ్లీ మాకగపడల, ఏడుపులూ మొత్తుకోళ్లూ... నాలుగురోజులగ్గాని శవాలు పైకి లేవల," ముసలమ్మ నడిమంచమ్మీద కాళ్లు బార్లా చాపి కూర్చుని చెప్పుకుపోతోంది.

నాయుడు శ్రద్ధగా వింటున్నాడు.

'గెనోళ్లు డబ్బులేవీ ఇయ్యలేదా?'' అడిగేడు నాయుడు. "ఎక్కడిది నాయినా? గెనిలోపల దిగి సస్తేనే దిక్కులేదు. డబ్బులు కట్టియ్యాల్సొస్తదని పైన పుస్తకంలో ఒక పేరు రాస్తిరి. గెనిలోకి దిగే మనిషి వేరేనాయె. అందునా దోవలో సచ్చినోళ్లకు డబ్బులు కట్టిస్తారా ఈ ఓనర్లు? తోడబుట్టినోళ్ల పెళ్లికి చేసిన అప్పులు మిగిల్చిపోయేడు పుణ్యాత్ముడు. కూలినాలి చేసి అప్పు తీర్చి పిల్లల్ని ఎక్కదీసేసరికి నా రెక్కలు పోయినియి నాయనా! ఇంక నేనేడ మిగిల్చేది చెప్పు," అని ఆగి "ఇన్నేళ్లొచ్చినా ఈ కట్టెకు సావు రావటంలేదు నాయినా!" అంది ముసలమ్మ.

"మొండి కట్టయి పోయినే! చావంత తేలిగ్గా వచ్చుద్దా?'' బఱ్ఱెగొడ్లకు గడ్డి వేసి వస్తూ కోడలు అంది.

"సరేలే! అసుర సంధ్యేల! నీ పోసుకోలు మాటలాపు," సైకిలు మీంచి దిగుతూ గోపాలయ్య అన్నాడు.

అప్పటికే చంద్రుడు ఊపిరి పోసుకుని ఉల్లాసంగా ఉన్నాడు. వీధిలైట్లు వెలగాలా వద్దా అన్నట్లుగా గుడ్డి వెలుతుర్నిస్తున్నాయి. పిల్లవాడొకడు పన్నెండో ఎక్కంరాక దాన్ని బట్టీయం వేస్తూ తెగ అల్లాడిపోతున్నాడు. ఎవురింట్లో నుంచో వస్తున్న మసాలా దట్టించిన కూరవాసన ముసలమ్మ ముక్కుపుటాలకు గాలమేసి లాగుతోంది.

ముసలామె వారంరోజుల తర్వాత ఆరోజున చారన్నం తింది. ప్రొద్దున్న ఉన్న వేడి కోడల్లో కాస్త తగ్గింది ముసలమ్మ జ్వరంలాగానే. కోడలొచ్చి పక్క విదిల్చింది.

"లోపలెయ్యక పొయ్యావా మంచం?" అన్నాడు గోపాలయ్య.

"కరంటుపోతే నిద్రపట్టదు. మీరు అన్నాలు తిన్నాక అరుగు మీద వేస్తే పడుకుంటాను," అంది ముసలమ్మ.

"ఎందుకు తల్లీ అరుగు మీద... పై నుంచి జారి పడితే ఇంకేమన్నా ఉందా?" అని ఆగి, "పడుకుంటే ఈడనే పడుకో, లేదంటే ఇంట్లోకి కదులు," అంది కోడలు.

ముసలమ్మ అక్కడే మంచమ్మీద వాలింది.

గోపాలయ్య స్నానం చేసొచ్చి బయట నీళ్లతొట్లో ఉన్న తాబేలును బయటకు తీసేడు. దానికి పసుపూ కుంకుమా పూసి ఇంట్లో వదిలి పూజ చేయటానికని లోపలికెళ్లేడు.

'తాబేలు ఇల్లంతా తిరిగితే నట్టిల్లంతా ధనలక్ష్మితో కలకలలాడుద్దని ఎర్రి వాడికి. ఆయనా ఇట్లాంటి చాదస్తపు పనులే చేస్తుండేవాడు. వారసత్వం గామాల,' అనుకుంది ముసలమ్మ పడుకునే.

మూడు నాలుగు రోజుల్లో పౌర్ణమి. చంద్రుడు సాధ్యమైనంత కాంతిని భూమ్మీదకు పంపుతున్నాడు. వీధిలైట్లు ఎప్పుడో ఆరిపోయాయి. ఎక్కడో తీతువు కూసింది. ముసలమ్మకు మెలకువొచ్చింది. అంతా నిశ్శబ్దం.

కోడలు తలుపు తీసుకుని ఇంటి బయటికొచ్చింది. బఱ్ఱెగొడ్లకు సాయంకాలం దూసుకొచ్చిన గడ్డిని విదిల్చింది.

చుట్టూ వెన్నెల... ఆ ఇంటి మీద నల్లగా పరుచుకున్న వేపచెట్టు నీడ... నాయుడి ఇంట్లో లైటు వెలుగు

కిటికీ సందుల్లోంచి బయటకు వస్తోంది. ప్రభావతమ్మ మెట్లెక్కి ప్రక్క పోర్షన్ తలుపుల్ని నెట్టుకుని లోపలి కెళ్లింది. ఆమె వెనకే తలుపూ మూసుకుంది.

ముసలమ్మ లేచి కూర్చుని మంచం కింద నుండి నీళ్ల చెంబు తీసుకుని నీళ్లు తాగింది. మళ్లీ పడుకుంది. ఆలోచనలతో నిద్రపట్టలేదు ముసలమ్మకు. మళ్లీ కాస్సే పటికి ఖాళీ అయిన అన్నం కూరగిన్నెలను తీసుకుని ప్రభావతమ్మ బయటకొచ్చింది.

తెల్లగా తెల్లవారినా ముసలమ్మ మంచమ్మీంచి లేవలేదు. ప్రభావతమ్మ రోజులానే నిద్రలేచి బఱ్ఱెగొడ్ల దగ్గర బాగు చేసింది. బయట కసువు ఊడ్చింది. కళ్లాపు జల్లింది. నీళ్లు మోసింది. స్నానం చేసి పూజ చేసుకుంది. గోపాలయ్య ఒక బఱ్ఱె పాలు తీసి ఏడుగంటల డ్యూటీకి తయారై తల్లి దగ్గరొకొచ్చేడు. తల్లిని తట్టి లేపేడు. ఊఁ అని అటు తిరిగి పడుకుందామె. ''ఏమ్మా! ఎట్టుంది?'' అంటూ తల్లి చేయి పట్టుకుని చూచేడు జ్వరం లేదు.

''లేచి కూర్చో! కాఫీనీళ్లు తాగితే కాస్త హుషారొచ్చుద్ది,'' అంది కోడలు. కూర్చుంది ముసలమ్మ. ముఖమంతా ఉబ్బిపోయి ఉంది. ఒంటిమీది ముడతలు మరింత వెడల్పు తేలేయి. కళ్లు ఎర్రబడి ఉన్నాయి.

''నాయుడన్న మధ్యాన్నం డబ్బులు తీసిస్తాడు. బ్యాంకులో కట్టి వాడికి పంపించు. ఎంత ఇబ్బంది పడుతున్నాడో అక్కడ. మళ్లీ ఫస్టుకు సర్దమన్నాడు ఆయన్న,'' అంది ప్రభావతమ్మ గోపాలయ్యతో.

ముసలమ్మ కాఫీ రెండు గుటకలు తాగి సహించడం లేదని గ్లాసు కింద పెట్టింది. వాంతి వస్తున్నట్లుగా ముఖం వికారంగా పెట్టింది.

''నిన్నటి మందులకు పైత్యమయి ఉంటుంది,'' అంది కోడలు. పదిగంటలకు అన్నం వేసుకొచ్చి ఇచ్చింది. కలిపి రెండు ముద్దలు తిని సహించడం లేదని కుక్క కేసింది అన్నాన్ని. గోపాలయ్య భోజనానికి రాగానే ముసలమ్మ అన్నం తినలేదని చెప్పింది ప్రభావతమ్మ.

తల్లి దగ్గరకొచ్చి చెయ్యి పట్టుకుని జ్వరం చూచేడు.

''ఏమ్మా! అన్నం తినలేదంట,'' అన్నాడు కొడుకు.

''ఏమోరా? సయించటం లేదు. తెల్లగా అన్నాన్ని చూస్తుంటేనే కక్కొచ్చేట్టుంది,'' అందామె.

''నీకు వక్కాకు నమలొద్దని ఎన్నిసార్లు చెప్పినా యినవు. లోటాలు లోటాలు సలసలమాడే టీ నీళ్లు గావాల. ఆ నాలుక రుచి తప్పిపోయినట్టుంది,'' అన్నాడు కొడుకు కోపంగా.

''వారంరోజుల్నుంచి తిండి లేకపోయె. సయించటం లేదని ఇప్పుడూ తినకపోతే లేచి తిరగేదెట్టా,'' కోడలొచ్చి అంది.

''నాకూ కూటికీ రుణం తీరినట్టుందమ్మా! నాలిక్కి సయించకపోతే నేనేం చేసేది చెప్పు?'' అంది ముసలమ్మ.

ఆ విధంగా మూడు రోజులు గడిచింది. అన్నం కలపడం, సహించడం లేదనడం, కొడుకో కోడలో కోప్పడితే రెండు ముద్దలు తిని కక్కేయడం...

కోడలుకు కోపమొచ్చి గట్టిగా కేకలేసింది. ''నువ్వు వేళకు పెట్టింది తింటావా! తిను. ఉగ్గబట్టుకుని కూడు తినకుండా నా వాకిట్లో పడి ఉండాల్సిన పనిలేదు. మా పాపాలు మాకున్నాయి. మళ్లీ నీ పాపమెందుకు మాకు. ఇక్కడుండటం నీకు ఇష్టం లేకపోతే నీ ఇష్టం వచ్చిన వాడి దగ్గరుండు. అంతేగాని కూటికీ, నాకూ రుణం తీరిపోయిందంటే కుదరదు. చానా రోగాల్ని విన్నాంగాని ఇదేం రోగమో నేనెక్కడా వినల.''

అదే రోజున రెండు సెలైను సీసాలు తీసుకొచ్చేడు గోపాలయ్య. ''వాటిని చూస్తుంటేనే భయం పుడుతుందిరా!'' అంది తల్లి.

''నన్ను ఆ ఏట్లో దొర్లించక ఇంకా ఇయ్యన్నీ ఎందుకురా,'' అని ఏడ్చింది. కొడుకు వినలేదు. పడుకోనని సతాయిస్తుంటే తల్లి చెంపకు లాగి ఒక్క దెబ్బ వేసేడు.

''తినమంటే తినవు. సెలైను కడతానంటే వినవు,'' అంటూ బలవంతాన వెనక్కు పడుకోబెట్టేడు. సెలైన్ సీసాను తాడుతో కిందకు వాలిన చెట్టుకొమ్మకు కట్టేడు. నరం వెదికి సూది గుచ్చేడు. 'అబ్బా' అని మూలిగింది ముసలమ్మ.

ఆకలి కావడానికని సెలైను సీసాలోకి ఎర్రటి మందును ఎక్కించేడు గోపాలయ్య. ముసలమ్మ వద్దంటున్నా వినకుండా సాయంత్రానికి మరో సీసాను కూడా ఎక్కించేడు.

చీకటి పడింది. చంద్రుడొచ్చేడు. గోపాలయ్యను రమ్మని పిలిచింది తల్లి.

''ఒరేయ్! ఆ తెల్లకూడంటేనే నాకు జలదరింతగా ఉందిరా! ఈ పూట నాకో ముద్దరాగి సంకటీ, కాసిని పచ్చి పులుసూ పోస్తే తింటారా,'' అంది.

కోడలు విని, ''అయ్యోవ్! ఒక కిలో రాగులు తేపో, తినాలేగాని కావాల్సింది చేసి పెట్టమా?'' అంది.

ఆ రాత్రి పొద్దు పోయింత తర్వాత ఒక పెద్ద రాగి సంకటి ముద్దను ఎర్రటి పచ్చి పులుసుతో అద్దుకుని జార మింగింది ముసలమ్మ. కొడుకూ కోడలూ కాస్త కుదుటపడ్డారు.

'ఫర్వాలేదులే! సెలైన్ మందు పనిచేసిందని,' కాస్త ఊరటపడ్డారు.

తెల్లారి కోడలు నిద్రలేచి చూచేటప్పటికి ముసలమ్మ మంచంలో లేదు. 'బయటకెళ్లి ఉంటది,' అని సరిపెట్టుకుంది. ఎంతసేపైనా రాకపోయేసరికి ఇంటి వెనక్కెళ్లి చూచింది. అనుమానమొచ్చి ఇంటి ముందు కర్రతుమ్మ చెట్లల్లో వెదికింది. ఎక్కడా కనబడ లేదు ముసలమ్మ. గోపాలయ్యను లేపింది. ఆ చుట్టు ప్రక్కలంతా వెదికేరు. గోపాలయ్యకు అనుమానమొచ్చి సైకిలెక్కి వాళ్ల ఊరువెళ్లేడు.

గుడిసె తలుపు ఓరగా వేసి ఉంది. నెట్టి లోపలి కెళ్లేడు.

లోపలంతా క్రొత్తగా, అర్థమయీ కానట్లుగా వుంది.

నట్టింట్లో తూర్పు పడమరలుగా ఒక చాపపరిచి ఉంది. చాప మీద తెల్లటి గుడ్డ పరిచి ఉంది. తూర్పు వైపున గుడ్డ క్రింద తలగడ పెట్టి ఉంది. తలగడ ప్రక్కనే దీపం వెలుగుతూ ప్రమిద... సాంబ్రాణి కడ్డీ వెలిగి ఆరిపోయిన వాసన ఆ గుడిసె నిండా పరుచుకుని వుంది.

గోపాలయ్యకు ఒక్కసారిగా దుఃఖం పొంగు కొచ్చింది. పెద్దగా వెక్కిల్లు పెడుతూ ఏడ్చేడు. గోపాలయ్య తమ్ముడు వచ్చేడు. ఇంటిప్రక్కల వాళ్లు చేరేరు. అందరూ కలిసి వాగూవంకా, చెట్టూ, పుట్టా గాలించేరు. కాని ముసలమ్మ జాడ మాత్రం లేకుండా పోయింది.

*వృద్ధాప్యం మీద కథ రాయమన్న మాష్టారు శ్రీ నాగభైరవ కోటేశ్వరరావుగార్కి కృతజ్ఞతలు...*

*సాహిత్యనేత్రం, అక్టోబర్-డిశంబర్, 1995*

